


వివాదాల ఎస్వీబీసీ

టీటీడీ అనుబంధ విభాగమైన ఎస్వీబీసీలో ఇష్టానుసారంగా సలహాదారులను నియమించారు. ధర్మారెడ్డి ఆధిపత్యం ఎస్వీబీసీలోనూ కొనసాగింది. ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావు సలహాదారు పదవిని సున్నితంగా తిరస్కరించారు కూడా.



ఈ పాపం నీదేనయ్యా!

'పాప ప్రక్షాళన'కు జగనొస్తున్నాడు.
ఎవరు చేసిన పాపం ఇది?
ఐదేళ్లు తిరుమలలో ఏం జరిగింది?
'మనోళ్ల' నిర్వాకం ఏమిటి?
భక్తీ, భయం, పాపభీతీ ఎలా మాయమయ్యాయి?
పర్సంటేజీల రాజకీయ అవినీతి టీటీడీలో ఎలా వేళ్లూనుకుంది?
సాధారణ భక్తులకు కిలోమీటర్ల క్యూలు.. వీవీఐపీలకు హారతి దర్శనాలు.. పేదలకు చలికి వణికే షెడ్లు.. పెద్దలకు స్టార్ హోటళ్లను తలదన్నే గెస్ట్‌హౌస్‌లు..
ఎవరు చేసిన పాపం ఇది జగనయ్యా?
బంధు, భక్త అనుచరగణం రెచ్చిపోయి తిరుమలను భ్రష్టు పట్టిస్తుంటే.. చేసిందేమిటి?
మౌనం.. అరాచకానికి ఆమోదం కాలేదా?
ఎలా ప్రక్షాళన అవుతుంది?
ఒక్కరోజు పూజతో చేసినవన్నీ చెరిగిపోతాయా?
గాయపడ్డ భక్త హృదయాలను అబద్ధాలతో మాయచేయగలరా?
ఐదేళ్లు.. మీ పాలనలో తిరుమల కేంద్రంగా జరిగిన తంతును భక్తకోటి తలచుకుని తల్లడిల్లుతోంది. మా విశ్వాసాలను మీ రాజకీయాలకు బలి చేయవద్దని చేతులు జోడించి వేడుకుంటోంది.

అంతా మనోళ్లే!

జగన్‌రెడ్డి పాలనలో మూడుసార్లు టీటీడీ పాలకమండళ్లను ఏర్పాటు చేశారు. జగన్‌రెడ్డికి సమీప బంధువులనే చైర్మన్‌లుగా నియమించారు. ఎన్ని విమర్శలు వచ్చినా చైర్మన్‌లూ, ఈవోలూ కూడా ఒకే సామాజికవర్గంవారినే నియమించారు. 2019లో చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఆ బోర్డులోని మొత్తం 37మందిలో ఈవోను మినహాయిస్తే చైర్మన్, ఒక ఎక్స్ అఫిషియో మెంబరు, నలుగురు మెంబర్లు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు కలసి ఎనిమిదిమంది రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. 2021లో రెండవ పాలకమండలి చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి కొనసాగారు. ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఈ బోర్డులోనూ ఏడుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారున్నారు. 2023లో ఏర్పడిన పాలకమండలిలో చైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి, ఈవోగా ధర్మారెడ్డి వున్నారు. ఇందులోనూ ఏడుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. ఐఏఎస్ కాకపోయినా ధర్మారెడ్డి కోసం వైసీపీ ప్రభుత్వం ఏకంగా అదనపు ఈవో పోస్టునే సృష్టించింది. జవహర్‌రెడ్డి బదిలీ తర్వాత రెగ్యులర్ ఈవోను నియమించకుండా ధర్మారెడ్డినే ఇంచార్జి ఈవోగా కొనసాగించింది. అర్హతలు లేకున్నా సందీప్‌రెడ్డి అనే వ్యక్తికి టీటీడీ ఐటీ విభాగంలో తొలుత సైబర్ ఎక్స్‌పర్ట్‌గా, తర్వాత ఏకంగా ఆ విభాగం జీఎంగా నియమించింది. అదే సామాజిక వర్గానికి చెందిన ఒక పోలీసు అధికారి సీఎంకు సన్నిహితుడనే పేరుతో తిరుమలలో జగన్ జమానాలో చక్రం తిప్పారు.

జగన్ సమర్పించిన జంబో బోర్డు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీని ఆ పార్టీ నేతలు తమ సొంత సంస్థగా మార్చుకునే ప్రయత్నం చేశారు. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 29 మందితో ఏర్పాటు కావాల్సిన పాలకమండలిని జంబో బోర్డుగా మార్చివేశారు. 2021 సెప్టెంబరులో 29మందిని సభ్యులుగా మరో 52 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించి టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చే ప్రయత్నం చేశారు. అయితే హైకోర్టు ఆదేశాలతో ప్రత్యేకాహ్వానితుల నియామకానికి బ్రేక్ పడింది.

అవినీతి మచ్చలున్నవారు పాలకమండలిలో

తీవ్ర అవినీతి ఆరోపణలున్న ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త కేతన్ దేశాయ్‌ని టీటీడీ పాలకమండలి సభ్యుడిగా జగన్ నియమించారు. ఈయనను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ పదవి నుంచే తొలగించారు. ఇటువంటి వ్యక్తిని బోర్డులోకి తీసుకున్నారు. మరొక బోర్డు సభ్యుడు శరత్‌చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో నిందితుడు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మీద క్రిమినల్ కేసులు వున్నాయి.

దర్జాగా దర్శనాల వ్యాపారం

దేవుడి దర్శనాన్నే వ్యాపారంగా మార్చేశారు. సాధారణ భక్తులను పదుల గంటల పాటు క్యూలైన్లలో పడిగాపులు గాసేలా చేసి, వీవీఐపీల సేవలో తరించారు. బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు సైతం తిరుమల కొండమీద సొంత పీఆర్వోలను నియమించుకుని దర్శనాల టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు ఐదేళ్లు వెల్లువెత్తినా జగన్ నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయారు. చైర్మన్ కోటాలో రోజుకు పది పన్నెండు మందికి మాత్రమే బ్రేక్ దర్శనాలకు సిఫారసు చేసే సంప్రదాయాన్ని వైసీపీ పాలనలో గాలికి వదిలేశారు. వైవీ సుబ్బారెడ్డి రోజుకు సగటున 364 మందికి వీఐపీ బ్రేక్ టికెట్లను ఇష్టానుసారం ఇచ్చేసేవారు. ఈయన చైర్మన్‌గా ఉన్న నాలుగేళ్లలో 3 లక్షలా 60 వేల మందికి ఇట్లా టికెట్లు కేటాయించారంటే టీటీడీని ఎంతగా సొంతానికి వాడేసుకున్నారో అర్థం అవుతుంది. ఆ తర్వాత చైర్మన్ అయిన భూమన కరుణాకరరెడ్డి కూడా ఇదే వారసత్వాన్ని కొనసాగించారు. ఉన్నది 9 నెలలే అయినా రోజుకు సగటున 172 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాల సిఫారసు లేఖలు ఇచ్చేవారు. ఇక స్వామి దర్శనాలను న్యాయమూర్తులకూ, ఢిల్లీ ప్రముఖులకూ ఎరగా వేసేవారన్న విమర్శలూ జగన్ మీద వచ్చాయి. ధర్మారెడ్డి ఈవోగా ఈ పనిని జగన్ కోసం చేసేవారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జగన్ మీద అనేక కేసులున్న నేపథ్యంలో న్యాయమూర్తులను ప్రసన్నం చేసుకోవడానికి దర్శనాల సమయంలో వారిని స్వామి ముందు కోరుకున్నంతసేపు ఉంచేసేవారనే ఆరోపణలున్నాయి.

శ్రీవాణిలో ఏం జరిగింది?

దర్శనాలలో దళారీలను తొలగించే లక్ష్యంతో ప్రవేశపెట్టి విజయం సాధించామంటూ అధనపు ఈవో ధర్మారెడ్డి పదేపదే ప్రకటించుకున్న శ్రీవాణీట్రస్టు మీద అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ పట్టించుకోలేదు. శ్రీవాణి పేరుతో బ్రేక్ దర్శనాన్ని రూ.10,500గా చేసి రోజుకు వెయ్యి టికెట్లు అమ్మేశారు. ఆ సొమ్ముల లెక్కలు తేల్చనేలేదు. ఆలయాల రిపేర్లకు, నిర్మాణాలకు వాడుతున్నామని చెప్పారు.శ్రీవాణిలో భారీ కుంభకోణం జరిగిందని భక్తులు భగ్గుమనడంతో విచిత్రంగా తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఒక నిజనిర్ధారణ కమిటీ వేసి, అంతా శభాష్ అని ఒక సర్టిఫికెట్ ఇప్పించుకున్నారు.

అద్దెలు మూడు రెట్లు...

తిరుమల కొండమీద వసతి అంటే భక్తులకు ఒకప్పుడు చవగ్గా లభించేది. తక్కువ ఖర్చుతో కుటుంబం అంతా ఒకటి రెండు రోజులు ఈ చల్లని ప్రదేశంలో దేవదేవుని సన్నిధిలో గడిపి వెళ్లేవారు. జగన్ పాలనలో పర్యాటక కేంద్రాలతో పోటీపడేలా ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో రేట్లు పెంచేశారు. పాలకమండలి సమావేశంలోనే (17 ఫిబ్రవరి 2022) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వేలం పాట తరహాలో గదుల అద్దె రేట్లు రెండు మూడు రెట్లు పెంచేలా నిర్ణయం తీసుకున్న వీడియో వైరల్ అయ్యి అందరూ ఇదేమి తీరు అని విస్తుపోయినా జగన్ చలించలేదు. గదుల నిర్వహణ కూడా దారుణంగా తయారైంది. పరిశుభ్రతను పట్టించుకోలేదు.

లడ్డూనే కల్తీ చేసేశారు కదయ్యా!

తిరుమల లడ్డూ అనగానే ఘుమఘుమ లాడేది. ఈ రుచి ఇంకెక్కడా ఎవరు చేసినా సాధ్యం అయ్యేది కాదు. ప్రపంచ పేటెంట్ కూడా తిరుమల లడ్డూకి లభించింది. ఇంతటి ప్రత్యేకత ఉన్న లడ్డూనే జగన్ జమానాలో భ్రష్టు పట్టించేశారు. ఇతర ముడి పదార్థాల సరఫరాకు, కోరుకున్నవారికి వందల కోట్ల టెండర్లు కట్టబెట్టేశారు. తమవాళ్లకే టెండర్లు దక్కేలా చేయడం కోసం ఏకంగా టెండరు నిబంధనలనే మార్చేశారు. రివర్స్ టెండర్ల పేరుతో కనీస నాణ్యత లేని సరుకులతో నింపేశారు. కల్తీ నెయ్యితో లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతనే దెబ్బ తీసేశారు. జగన్ పాలనలో పొందిన టెండరుతో సరఫరా చేసిన నెయ్యిలో పందికొవ్వు, ఆవుకొవ్వు వంటివి ఉన్నాయని తేలడం.. టీటీడీ చరిత్రలోనే ఎన్నటికీ చెరగని మచ్చగా మిగిలిపోయింది.ఆర్గానిక్ ముడి పదార్థాల పేరుతో ఇతర అన్న ప్రసాదాలను కూడా రుచిలేకుండా చేసేశారు.

టీటీడీలోనూ పనులకు పర్సెంటేజీలు

టీటీడీ నిర్మాణ పనులంటే ఒకప్పుడు నాణ్యతకు తిరుగులేదనే పేరుండేది. అందుకు కారణం అవినీతికి అవకాశం పరిమితం కావడమే. కొద్దిమంది అధికారులో, ఉద్యోగులో ఆశపడ్డా కానుకల స్థాయికి మించేది కాదు. జగన్ పాలనలో రాష్ట్రప్రభుత్వం పనుల తరహాలోనే పర్సెంటేజీల విధానం మొదలైంది. నాయకులకు వాటాలు తప్పలేదు. అవసరంతో సంబంధం లేకుండా నిర్మాణ పనులు విపరీతంగా పెంచేశారు. వందల కోట్లు కేటాయించేశారు. దీంతో టీటీడీలోనూ అవినీతి వ్యవస్థగా మారిపోయింది. ముఖ్యంగా ఎన్నికలకు ఏడాది ముందు నుంచీ ఈ పరిస్థితి విపరీతమైందనే ఆరోపణలున్నాయి. తిరుపతిని కేంద్రం చేసుకుని అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా నిధులు విడుదల చేశారు. రోడ్లు, భవనాలకు నాయకులు అడగడం, అధికారులు కేటాయించేయడం జరిగింది. తిరుపతి నాయకుల పర్సెంటేజీల కోసమే రూ. వందల కోట్లు పనులు ఆగమేఘాల మీద మొదలు పెట్టారనే విమర్శలు వచ్చాయి. బాగున్న సత్రాలు కూల్చేసి కొత్తవి నిర్మించడానికి రూ.600 కోట్లు కేటాయించేశారంటే అవినీతి విశ్వరూపం అర్థం అవుతుంది. స్విమ్స్‌లో దివ్యంగా ఉన్న భవనాలను రిపేరు చేయాలంటూ రూ.200 కోట్లు ధారాళంగా కేటాయించేశారు. తిరుపతి నాయకుల ఎన్నికల ఖర్చుల కోసమే ఆగమేఘాల మీద కాంట్రాక్టులు ఇచ్చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ ప్రభుత్వం.. 'ఏం జరిగింది' అనే ఆరా కూడా తీయలేదు. అర్హత లేని అధికారిని ఇంచార్జి సీఈగా నియమించారు.నిబంధనలకు విరుద్ధంగా సీనియర్లు వున్నప్పటికీ రెగ్యులర్ సీఈగా అతన్నే కొనసాగించారు. బాధిత అధికారికి న్యాయం చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా అమలు కాలేదు.

జిల్లా పాలనలోనూ అదే ముద్ర

జిల్లా తొలి కలెక్టర్‌గా వెంకట్రమణారెడ్డి, తిరుపతి అర్బన్ ఎస్పీగా ఆవుల రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్పీగా పరమేశ్వర రెడ్డి, తిరుపతి ఆర్డీవోలుగా కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి, ఎస్వీయూ వీసీలుగా రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బర్డ్ స్పెషలాఫీసర్‌గా రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ స్పెషలాఫీసర్‌గా జగదీశ్వర్‌రెడ్డి... ఇలా కీలక స్థానాల్లో ఒకే సామాజికవర్గానికి చెందిన వారే గత ఐదేళ్లలో పనిచేశారు. కనకనరసారెడ్డి బదిలీ అయినా జిల్లా దాటకుండా రుయాలో ఏవోగా నియమితులయ్యారు. జిల్లాలో పలు శాఖల అధికారులుగా, పోలీసు శాఖలో కీలక స్థానాల్లోనూ అదే వర్గానికి చెందిన వారు పనిచేశారు.

జిల్లాలోనూ పవర్ అంతా వాళ్లదే!

జగన్ పాలనలో జిల్లా అంతా ఒకే సామాజికవర్గం మయం అయిపోయింది. పదవులన్నీ వారికే. అధికారులూ వారే. జిల్లాలో ఎనిమిది సెగ్మెంట్లుంటే మూడు ఎస్సీ రిజర్వుడు మినహా మిగతా ఐదు స్థానాల్లో ఒకే సామాజికవర్గం వారు వైసీపీ తరపున ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర రెడ్డి మూడున్నరేళ్లు, ఆపై ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి తదుపరి ఏడాదన్నర కొనసాగారు. వీరిద్దరూ టీటీడీ ట్రస్టు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యులుగా కూడా కొనసాగారు. తిరుపతి కార్పొరేషన్‌లో రెండు మేయర్ పదవుల్లో ఒకటి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి కుమారుడు అభినయ్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యే, తుడా చైర్మన్ పదవులకు అదనంగా చెవిరెడ్డి అసెంబ్లీ విప్ పదవి కూడా పొందారు.

పూలంగి సేవలో వరసిద్ధుడి వైభోగం



వరసిద్ధుడికి ఊంజల్ సేవలో పంచ హారతి

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 26:కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో గురువారం రాత్రి వరసిద్ధుడికి పూలంగి సేవను వైభవంగా నిర్వహించారు.ఉభయదారులైన వేలూరుకు చెందిన రాజమాణిక్యం నాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు, కాణిపాకానికి చెందిన రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో తయారు చేసిన భారీ గజమాలలతో,పుష్ప,గరిగ కిరీటాలతో అలంకరించారు. పుష్ప సోయగంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆనందపరవశులయ్యారు.విజయవాడ దుర్గాలయం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పూలంగి సేవలో భాగంగా గురువారం రాత్రి ఆలయంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయంలోని ప్రాకారంలో మూడు చుట్టు తిప్పారు. అనంతరం ఉత్సవర్లను అలంకార మండపంలో వుంచి ఏక, నక్షత్ర, పంచ, కుంభ, రథ హారతితో పూజలు నిర్వహించారు.తరువాత సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. ప్రత్యేక ఉత్సవాలతో అలసిన స్వామివారిని సేద తీర్చడానికి ఈ సేవను నిర్వహిస్తారని భక్తులు భావిస్తుంటారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి,హరిమాధవరెడ్డి,సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి,ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి,విఘ్నేష్, ఉభయదారులు పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం

కాణిపాక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆఖరుదైన తెప్పోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.పుండరీక నాయుడు, శేషాద్రినాయుడు,హనుమంత నాయుడు,రామకృష్ణారెడ్డి , గురజా దామోదరనాయుడు,చల్లగుండ్ల దామోదర నాయుడు జ్ఞాపకార్థం వారి వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.తెప్పోత్సవ అనంతరం ఉత్సవాల గుర్తుగా తయారు చేసిన 21 కేజీల మహా లడ్డూను వేలం వేయనున్నారు.



దిన్నెపల్లెలోకి కొండచిలువ

గుడుపల్లె, సెప్టెంబరు 26: గుడుపల్లె మండలం సోడిగానిపల్లె పంచాయతీ దిన్నెపల్లెలోకి గురువారం ఓ కొండచిలువ వచ్చింది.కుక్కలు అరుస్తుండడంతో గ్రామానికి చెందిన బోయవెంకటేశు బయటకు వచ్చి చూడగా ఇంటి సమీపంలో కొండచిలువను కన్పించింది.విషయం తెలుసుకున్న గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో వారు గ్రామానికి చేరుకున్నారు.కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు.

పీఎఫ్ సమస్యలపై నేడు సదస్సు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26: వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) శుక్రవారం 'నిధి ఆప్కే నికట్ 2.0' సదస్సును చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని క్యాంఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించనుంది. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని తిరుపతి రీజనల్ పీఎఫ్ కమిషనర్ ఒకప్రకటనలో తెలిపారు.

గాల్లో దీపంలా డీటీలు

- 67మంది భూరీసర్వే ఉప తహసీల్దార్లకు ముగిసిన పదోన్నతి గడువు
- 21వ తేదీ వరకే జీతాలంటున్న ఖజానా శాఖ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26 : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పనిచేస్తున్న 67 మంది భూరీసర్వే ఉప తహసీల్దార్ల పరిస్థితి గాల్లో దీపంలా మారింది.గత ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకాన్ని ప్రారంభించినప్పుడు డీటీలకు హడావుడిగా తాత్కాలిక పదోన్నతి కల్పించింది. రెండేళ్ల కాలపరిమితితో ఇచ్చిన పదోన్నతి గడువు ఈనెల 21వ తేదీతో ముగియడంతో వివాదం తెరపైకి వచ్చింది.నిజానికి ఈ నెల ప్రారంభంలోనే రీసర్వే ఉప తహసీల్దార్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతి గడువును పొడిగిస్తారా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చిన తర్వాత భూరీసర్వే పనులను ఆపేసింది. అంతకు ముందు కూడా సార్వత్రిక ఎన్నికల నియమావళి దృష్ట్యా ఏప్రిల్ నుంచి అన్ని మండలాల్లో సర్వే పనులు ఆగిపోయాయి. ఎన్నికలప్పటి నుంచి వారికి నిర్దిష్టమైన విధులు లేకపోవడంతో సంబంధిత తహసీల్దార్లు తమ పరిధిలో తమకు కావాల్సిన పనులు చేయించుకుంటున్నారు.సర్వే ఉపతహసీల్దార్లను ఇదే పోస్టులో కొనసాగిస్తారో లేదో ఇప్పుడే చెప్పలేమని డీఆర్వో బి.పుల్లయ్య చెప్పారు.ఈ నేపథ్యంలో ప్రస్తుత నెలకు సంబంధించి 21రోజులకే జీతం బిల్లుకు ఆమోదం తెలపాలని, నెల మొత్తానికి డీడీవోలు బిల్లు పెడితే వెనక్కి పంపాలని జిల్లా ఖజానాశాఖ డీడీ రామచంద్ర ఉత్తర్వులు జారీచేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు రీసర్వేయర్ల జీతాల బిల్లులు 30రోజులకు డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్లు (డీడీవోలు) పెడితే... వెనక్కి పంపాలని సూచించినట్లు జిల్లా ఖజానా కార్యాలయ ఏటీవో హరనాథ్ చెప్పారు.



● భూ రీసర్వేకోసం...

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా భూరీసర్వేకి సిద్ధమైంది. క్షేత్రస్థాయిలో తలెత్తే భూవివాదాలు, సమస్యల పరిష్కారాల కోసం రీసర్వే పోస్టులు సృష్టించింది. రెండేళ్ల కాలపరిమితితో సూపర్ న్యూమరరీ పోస్టులకు శ్రీకారం చుట్టింది. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు తాత్కాలికంగా మంగళం పాడి ఒక్క కలంపోటుతో ఆ పోస్టులను రద్దు చేసింది. ఉమ్మడి జిల్లాలో 67 మండలాల్లోని 67 పోస్టులను రద్దుచేసి రీసర్వే డీటీ పోస్టులను సూపర్ న్యూమరరీగా సృష్టించింది. సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐలకు తాత్కాలిక పదోన్నతి కల్పించారు. 2022 సెప్టెంబరు 22న అప్పటి భూపరిపాలనా ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) జి. సాయిప్రసాద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26:మొత్తానికి బదిలీల ప్రక్రియకు తెరపడింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉద్యోగులకు మాత్రం ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పించారు. మిగిలిన 15 శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వం గతనెల 25న బదిలీలకు చివరితేదీగా నిర్ణయించింది. పెన్షన్ పంపిణీ అవసరాల రీత్యా ఈనెల 15 వరకు గడువు పెంచింది. ఆ లోగా భారీవర్షాలు కురవడంతో బదిలీల ప్రక్రియను ఈనెల 22వ తేదీవరకు పొడిగించింది. బదిలీ ఉద్యోగులు విధుల్లో చేరడంతో ప్రతి కార్యాలయంలో కొత్తవారితో సందడి నెలకొంది.నగరపాలక, పురపాలికల్లోనూ కమిషనర్లు, ఇంజనీర్లు, ప్రణాళిక అధికారులు పెద్దసంఖ్యలో బదిలీ అయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బీ, జిల్లాపరిషత్, డ్వామా, డీఆర్డీఏ, గనులశాఖల్లో కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జిల్లా అధికారుల నుంచి డివిజనల్ స్థాయి అధికారుల వరకు చాలామంది కొత్త అధికారులు వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన బదిలీలు ప్రశాంతంగా ముగియడంతో ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది.అయితే డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల్లో పారదర్శకత లోపించిందని రెవిన్యూ ఉద్యోగుల సంఘం మాజీ నాయకుడు విజయసింహారెడ్డి ఆరోపించారు.చిత్తూరు పరిసరాల్లో వున్న 30మందిని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం, శాంతిపురం, రామకుప్పం, సదుం, సోమల, చౌడేపల్లి, నగరి, నింద్ర, విజయపురం మండలాలకు బదిలీ చేశారన్నారు.ఉన్నతాధికారులు ఉద్యోగుల మనోభావాలను గుర్తించి బదిలీలపై పునఃపరిశీలన చేయాలని ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగులు 2వరకు ఆగాల్సిందే

జిల్లాలోని 612 మంది సచివాలయ ఉద్యోగులకు సంబంధిత శాఖల వారీగా బదిలీ ప్రక్రియ పూర్తిచేశారు. తొలుత వీరిని 26వ తేదీ వరకు రిలీవ్ చేయవద్దని ప్రభుత్వం ఆదేశించింది. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గ్రామ, వార్డు పరిధిల్లో జరుగుతున్న దృష్ట్యా బదిలీ గడువు పెంచింది. కాగా అక్టోబరు 1వ తేదీన పించన్ల పంపిణీని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 2వ తేదీవరకు రిలీవ్ చేయవద్దని తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి.

కాణిపాకంలో తెప్పోత్సవానికి పుష్కరిణి సిద్ధం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం నిర్వహించనున్న తెప్పోత్సవానికి ఆలయ పుష్కరిణిని అధికారులు గురువారం సాయంత్ర సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పుష్కరిణిలోని పాతనీటిని పూర్తిగా తొలగించి.. తాజా నీటితో నింపారు. పుష్కరిణిలోనికి ఎంత మంది భక్తులను అనుమతించాలని పోలీసు అధికారులతో ఆలయ ఈవో గురుప్రసాద్ చర్చించారు.

పరిశ్రమల స్థాపనతోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు



ప్రసంగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 26: పరిశ్రమల స్థాపనతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీతోపాటు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర కమిషనర్ (కేజీబీపీ) డైరెక్టర్ ఎస్.గ్రీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ కింద విరివిగా రుణాలు, సబ్సిడీ మంజూరు చేస్తుందన్నారు. చదువుకున్న యువత వీటిని సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

'చిన్నారి మృతికి మా మెడిసిన్ కారణం కాదు'

- ఇంట్లో చనిపోతే మాపై నింద మోపారు
- పోస్టుమార్టంలో మా మందులు కారణం కాదని తేలింది
- పుంగనూరు ఘటనపై డాక్టర్ కార్తీక్ స్పందన

పుంగనూరు, సెప్టెంబరు 26: పుంగనూరు పట్టణంలో ఈనెల 21వ తేదీన ఓ చిన్నారి మృతి చెందితే.. దానికి కారణం వైద్యుడేనని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించి వైద్యుడిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంగా ఆరోపణలు ఎదుర్కొన్న డాక్టర్ కార్తీక్ తాజాగా స్పందించి జరిగిన పరిణామాలపై స్పష్టతనిచ్చారు. 'పుంగనూరు పట్టణం నక్కబండకు చెందిన సాత్విక్ అనే చిన్నారి 21వ తేదీన రాత్రి 9 గంటలకు ఇంట్లో పొరపోవడంతో చనిపోతే, దానికి నా మందులే కారణమనే నిందను మోపి నాపై 30 మంది కలిసి దాడి చేశారు. మా వద్ద పది రోజులు చికిత్స తీసుకున్నామని, మేమిచ్చిన చుక్కల మందు మరణానికి కారణమని వారు చేసిన ఆరోపణలు అవాస్తవం. మా మందు కారణమైతే అదే చిన్నారికి, అదే మందును 14వ తేదీన కూడా ఇచ్చాం. అప్పుడు వికటించలేదు కదా. చిన్నారికి జరిపిన పోస్టుమార్టంలో కూడా మా మందులు కారణం కాదని తేలింది. అప్పటినుంచి మా వద్ద గతంలో మందులు తీసుకున్నవారు కూడా వెనక్కి ఇచ్చేస్తున్నారు. వైద్యారోగ్య శాఖ వారు తనిఖీలు చేసి మందులన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పారు. చేయని నేరానికి నింద మోయడం బాధగా ఉంది.' అని డాక్టర్ వివరణ ఇచ్చారు.

ఇరిగేషన్ డిజైన్స్ ఎస్ఈగా శారద

- పలువురు ఈఈల బదిలీ

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఓరింపాటి శారద నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కడప జిల్లా ఇరిగేషన్ శాఖలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఉన్న ఆమె గురువారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తెలుగు గంగ ప్రాజెక్టు గాలేరు-నగరి విభాగం ఒకటవ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం మంజుల కడప జిల్లా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు 2వ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వ్యవహరిస్తున్న ఇరగా శ్రీనివాసరావు అక్కడ నుంచీ గూడూరు ఎన్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం తుంగభద్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజావత్ సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు రేణిగుంట జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

చిత్తూరు ఆర్డీవోగా శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26: చిత్తూరు ఆర్డీవోగా ఎం.శ్రీనివాసులును నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న చిన్నయ్యను బదిలీ చేస్తూ.. ప్రభుత్వ కార్యదర్శి ముందు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. కాగా, శ్రీనివాసులు.. నెల్లూరు జిల్లా రాపూరు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తుండగా, చిత్తూరు ఆర్డీవోగా బదిలీ చేశారు.

బాపట్ల ఆర్డీవోగా గ్లోరియా

బాపట్ల ఆర్డీవోగా చిత్తూరు పూర్వ జడ్పీ సీఈవో గ్లోరియాను ఆమె మాతృశాఖ అయిన రెవెన్యూకు బదిలీ చేస్తూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా బాపట్ల ఆర్డీవోగా నియమిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులిచ్చింది.

కడప కమిషనర్‌గా పలమనేరు ఆర్డీవో బదిలీ

పలమనేరు ఆర్డీవో మనోజ్ రెడ్డిని కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాఠశాలలో గుండెపోటుతో హెచ్ఎం మృతి



సోమల, సెప్టెంబరు 26: సోమల మండలం చింపిరెడ్డిగారిపల్లె పాఠశాల హెచ్ఎం. డి. సుధాకర్‌నాయుడు గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. బసవ పల్లెకు చెందిన సుధాకర్ నాయుడు గురువారం పాఠశాలకు వెళ్లి తీవ్ర ఛాతీ నొప్పితో పెద్ద ఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎంఈవోలు శివరత్న, శ్రీరాములు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

అర్జీల్లో సింహభాగం గుడుపల్లె రెవెన్యూ సమస్యలపైనే

కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 26:ప్రజా సమస్యలను ఏమాత్రం అలక్ష్యం చేయవద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను హెచ్చరించారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో సమస్యల పరిష్కారం సంతృప్తి స్థాయిలో జరగాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి మొత్తం 117 అర్జీలు వివిధ సమస్యలపై అధికారులకు అందాయి. ఇందులో గుడుపల్లె రెవెన్యూకు సంబంధించి ఏకంగా 95 అర్జీలు ఉన్నాయి. భూ సర్వేకు చెందినవి 15, పోలీస్ 4, మున్సిపల్, పబ్లిక్ హెల్త్, నీటి సమస్యలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.






మృతిచెందిన క్లీనర్ యాదగిరి - కాలిపోయిన డ్రైవర్ రామ్‌రాజ్ మృతదేహం - తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ సాయికృష్ణ, క్లీనర్ నాగయ్య

ఆగివున్న లారీని ఢీకొన్న లారీ

డీజిల్ ట్యాంక్ పగిలి దగ్ధమైన లారీ

మొగిలి ఘాట్‌లో మరో ప్రమాదం

ఇద్దరి మృతి - మరో ఇద్దరికి తీవ్రగాయాలు



దగ్ధమవుతున్న లారీ

బంగారుపాళ్యం, సెప్టెంబరు 26 : మరమ్మతుల కోసం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.గురువారం వేకువ జామున బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి ఘాట్ లో చోటు చేసుకున్న ఈ ప్రమాద వివరాలు పోలీసుల కథనం మేరకు...వి.కోట నుంచి కట్టెల లోడుతో భద్రాచలం వెళుతున్న ఓ లారీ బుధవారం మధ్యాహ్నం ఇంజన్ మొగిలి ఘాట్ వద్దకు రాగానే పాడైంది.దీంతో రోడ్డు పక్కనే లారీని ఆపి డ్రైవర్,క్లీనర్ విశ్రాంతి తీసుకున్నారు. లారీ సమీపంలోనే రాత్రి నిద్రపోయారు.ఈ నేపథ్యంలో రాత్రి రెండున్నర గంటల సమయంలో బెంగళూరు నుంచి పంచదార లోడుతో వెళుతున్న మరో లారీ అక్కడే అదుపు తప్పింది.పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొంటూ ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. అలాగే పక్కకు తిరిగి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొని పెద్దగోతిలో పడిపోయి నుజ్జునుజ్జైంది. లారీ ఢీకొనడంతో ఆగివున్న లారీలో డీజిల్ ట్యాంకు పగిలి మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. ఘటనా స్థలానికి డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు చేరుకుని చిత్తూరు, పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక జిల్లా అధికారి పెద్దిరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లారీలో మంటలను ఆర్పివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలో వున్న కట్టెలను తొలగించారు. లారీ కింద అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలగూడేనికి చెందిన డ్రైవర్ జామిశెట్టి రామరాజ్(50) పూర్తిగా కాలి మాంసంముద్దలా మారిపోయివుండడం గమనించారు.తీవ్రంగా గాయపడ్డ క్లీనర్ నాగయ్యను 108అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చక్కెర లోడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన డ్రైవర్ సాయికృష్ణ(31), వరంగల్లుకు చెందిన క్లీనర్ యాదగిరి(50)లను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. క్లీనర్ యాదగిరి అప్పటికే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను 108అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహలను ప్రైవేటు అంబులెన్స్ ద్వారా బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

ప్రమాదంలో లారీ దగ్ధమవడంతో సుమారు 3 గంటల పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రమాదాలకు గురైన లారీలను తొలగించి పోలీసులు వన్ వే ద్వారా వాహనాలను పంపించారు.పంచదార లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. లారీ డ్రైవర్ సాయికృష్ణకు మొగిలి ఘాట్ మీద అవగాహన లేకపోవడంతో అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.





కట్టెల లారీని ఢీకొట్టి ఛిద్రమైన చక్కెర లారీ - ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన యాదగిరిని ఎక్స్‌కవేటర్‌తో వెలికితీస్తున్న దృశ్యం

సాయం అందకనే చనిపోయాడు

తొమ్మిది నెలలుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయిన దత్తాత్రేయ - విధి నిర్వహణలో గాయపడ్డా సచివాలయ ఉద్యోగికి అందని సాయం



దత్తాత్రేయ (ఫైల్ ఫొటో)

పెనుమూరు, సెప్టెంబరు 26: ప్రభుత్వ సాయం అందకనే సచివాలయ ఉద్యోగి దత్తాత్రేయ తనువు చాలించాడు. 9నెలల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్‌లో ఇతను గాయపడి కోమాలోకి వెళ్లిపోయాడు. ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి పాలై నెలలు గడిచినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు. కుటుంబ సభ్యులు.. అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యేలను కలిసి తమ కుమారుడి దీన స్థితిని వివరించారు. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండంటూ వేడుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ వస్తే కాస్త ఆదరవుగా ఉంటుందని తిరిగి తిరిగి వేసారిపోయారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక ఇతడి పరిస్థితిని తెలుసుకున్న ఆంధ్రజ్యోతి ఈనెల 20వ తేదీన 'నా బిడ్డను ఆదుకోండి' అనే శీర్షికన కథనం కూడా ప్రచురించింది. సాయం అందేలోగా దాదాపు తొమ్మిది నెలలుగా మృత్యువుతో పోరాడి గురువారం మృతి చెందాడు.

చంద్రగిరి మండలం మల్లంగుంట రోడ్డు ఉత్తరపు కండ్రిగలోని లక్ష్మి, ఎల్లయ్య దంపతుల ఒక్కగానొక్క కుమారుడు దత్తాత్రేయ. పెనుమూరు మండలం కామచిన్నయ్యపల్లె సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేసేవాడు. గత ఏడాది డిసెంబరు 29వ తేదీన ఆడుదాం ఆంధ్ర పోటీలకు తిరుపతి నుంచి ఫ్లెక్సీలు తీసుకుని పెనుమూరుకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఉదయం 7.30 గంటలకు చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద జరిగిన యాక్సిడెంట్‌లో తలకు తీవ్రగాయమైంది. మరో ఉద్యోగికి కాలు విరిగింది. దత్తాత్రేయకు తొలుత సీఎంసీలో ఆపరేషన్ చేసినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే సుమారు రూ.10లక్షల ఖర్చయ్యింది. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు సహ ఉద్యోగులు, స్నేహితులు తలో చెయ్యి వేసినా సరిపోలేదు. కొద్ది రోజుల తర్వాత తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోస్ట్ ఆపరేటివ్ చికిత్స చేయించినా.. ఇంట్లోనే పెట్టుకుని తల్లిదండ్రులు చూసుకుంటున్నారు. చివరకు ప్రభుత్వ సాయం అందేలోపు మృతి చెందడం.. సహోద్యోగులు, స్థానికులను కలచివేసింది.

పేద కుటుంబంలో పుట్టినా..

పేద కుటుంబంలో పుట్టి కుటుంబ ఆర్థిక పరిస్థితులను చూస్తూ గొప్ప స్థాయికి ఎదగాలని చదువులో ముందుండేవాడు దత్తాత్రేయ. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలనే తపనతో చదివాడు. మధ్యలోనే సచివాలయ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటూ.. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలోనే యాక్సిడెంట్ జరిగి.. ఇపుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు.

చిత్తూరులో విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ● కార్యాలయ భవనం, అధికారుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న అధికారులు



చిత్తూరు విద్యుత్ కార్యాలయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాను విభజన చేసి.. విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయ ఏర్పాటును గాలికొదిలేశారు. అప్పటి నుంచి విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తలెత్తితే తిరుపతిలోని సర్కిల్ కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చేది. వ్యయప్రయాసలతో అక్కడికి చేరుకుంటే.. అక్కడ ఎస్ఈ లేకుంటే వెనుతిరిగేవారు. వీటన్నింటికీ చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు ప్రత్యేక సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సర్కిల్ కార్యాలయ భవనంపై క్లారిటీ లేదు

చిత్తూరు సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తారు.. ప్రభుత్వ భవనంలోనా? లేక అద్దె భవనంలోనా? ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? అనే క్లారిటీ ఇవ్వలేదు ప్రభుత్వం. అధికారులు, సిబ్బంది స్థానాలను కేటాయించారే తప్ప ఇంకా అధికారులేవరనేదీ స్పష్టత ఇవ్వలేదు. దీనిపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చిత్తూరు సర్కిల్ పరిధిలో డివిజన్లు ఇవే

కొత్తగా ఏర్పాడిన చిత్తూరు సర్కిల్ పరిధిలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు డివిజన్లు ఉంటాయి.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 14మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయపురంలో అత్యధికంగా 65.6 మి.మీ, సదుంలో అత్యల్పంగా 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. నగరిలో 42.2, నింద్రలో 38.4, పాలసముద్రంలో 29.2, చిత్తూరు రూరల్‌లో 26, కార్వేటినగరంలో 14.6, పులిచెర్లలో 12.4, వెదురుకుప్పంలో 9.2, ఐరాలలో 7.4, చౌడేపల్లెలో 3.2, శ్రీరంగరాజపురంలో 3, పెనుమూరులో 2.2, చిత్తూరు అర్బన్‌లో ఒక మి.మీ వర్షంకురిసింది.

డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీగా రవికుమార్ నాయుడు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 26: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి పీడీగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడిని నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన డీఆర్డీఏ పీడీ తులసిని గురువారం రిలీవ్ చేసి రవికుమార్ నాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.





షాట్‌పుట్ - లాంగ్ జంప్ - వంద మీటర్ల పరుగు పందెం

చిత్తూరులో 'స్కూల్ గేమ్స్' ప్రారంభం



డీఎస్ఏ మెసానికల్ మైదానంలో క్రీడాకారుల సందడి

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 26: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు చిత్తూరు డీఎస్ఏ మెసానికల్ మైదానంలో అథ్లెటిక్స్ అండర్ 14, 17 బాలబాలికల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలింగ్ త్రో పోటీలు జరిగాయి. శుక్రవారం కూడా పోటీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ఫెడరేషన్ విఫలం : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దూర ప్రాంతాల నుంచి వందలాది మంది బాలబాలికలు ఎంపిక పోటీలకు తరలివచ్చారు. వీరికి మౌలిక వసతుల కల్పనలో ఫెడరేషన్ అధికారులు విఫలమైనట్లు విమర్శలు వినిపిస్తున్నారు. ఆద్వాన మరుగుదొడ్లతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భోజనం కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మిడ్డేమీల్సనే క్రీడాకారులు సరఫరా చేశారు. ఆ భోజనాలు నాణ్యత లేక వాటిని తినలేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

తాగునీటి సమస్య తీర్చాలి


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

గుడుపల్లె, సెప్టెంబరు 26: గుడుపల్లె మండలం కుప్పిగానిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ మహిళలు గురువారం గ్రామసచివాలయం ఎదుట ఖాళీబిందెలతో ధర్నా నిర్వహించారు. కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో తాము సతమతమవుతున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు. సమస్యను పరిష్కరించాలని స్థానిక సర్పంచు, అధికారులను పలుసార్లు కోరినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా చాలీచాలని నీరు అందిస్తున్నారని, దీంతో తాము వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ తాజ్‌మస్సూర్ అక్కడకు చేరుకుని త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

15 ఏళ్ల భూ తగాదాలు పరిష్కారం

కుప్పం రూరల్, సెప్టెంబరు 26: కుప్పం మండలం దేవరాజపురంలో ఇరు వర్గాల మధ్య గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న భూ తగాదాలు దళిత నాయకుల చొరవతో పరిష్కారమయ్యాయి. దళిత యువజన సేవాసంఘం వ్యవస్థాపకుడు కన్నన్ ఆధ్వర్యంలో గురువారం ఇరువర్గాలు గ్రామంలో సమావేశమయ్యారు. పరిష్కారానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు కందస్వామి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, మూర్తి, అన్నాదొరై, కుమార్, సతీశ్, శరవణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జిల్లా క్రీడా పోటీలకు 25 మంది విద్యార్థుల ఎంపిక

కల్లూరు, సెప్టెంబర్ 26: జిల్లాస్థాయి క్రీడాపోటీలకు 25మంది విద్యార్థులు ఎంపికైనట్లు కల్లూరు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, విమల విక్టోరియా, రుక్మాంగద తెలిపారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదుం గురుకుల పాఠశాలలో నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీల్లో కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు.

జడ్పీ హైస్కూళ్లలో డీఈవో తనిఖీలు

కల్లూరు, సెప్టెంబర్ 26: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని డీఈవో దేవరాజులు తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలని, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదుం : సదుం జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో దేవరాజు గురువారం తనిఖీ చేశారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి, శుచిని పరిశీలించారు. అలాగే పదవ తరగతి పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో బాదం మొక్కలను పిల్లలతో కలిసి నాటారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. చదువులో ప్రతిభ చూపుతున్న 9వ తరగతి విద్యార్థిని అర్పియాను దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఈవో దామోదరం, ప్రధానోపాధ్యాయులు జయకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలమాసనపల్లి పెద్దచెరువులో మట్టి తవ్వకాలు

పలమనేరు, సెప్టెంబరు26 : కొలమాసనపల్లి పెద్దచెరువులో ఉపాధి పనులు ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గురువారం ఉదయాన్నే ఒక ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సాయంతో పెద్దచెరువులో తవ్వకాలు చేపడుతున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. ఈవిషయాన్ని కొందరు సోషియల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయమై ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో పుష్పలతను వివరణ కోరగా యంత్రాలతో పనులు ఎవరు చేయించినా బిల్లులు ఇవ్వడం కుదరదన్నారు.

సొన్నేపల్లెలో టీడీపీ నేతల పర్యటన



పెద్దపంజాణి, సెప్టెంబరు26: రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరుతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తున్నారు. గురువారం రాజుపల్లె పంచాయతీ సొన్నేపల్లెలో జిల్లా టీడీపీ యువ నాయకుడు భానుప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ యాదవ్, మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో ఉన్న ప్రభుత్వ మందుల మాయం
చిన్నారిదొడ్డి సచివాలయంలో విచారణ చేపట్టిన జిల్లా వైద్యాధికారులు

శాంతిపురం, సెప్టెంబర్ 26 : ముళ్ల పొదల్లో పడి ఉన్న ప్రభుత్వ మందులు మాయమయ్యాయి. గురువారం వార్త పత్రికల్లో 'ప్రభుత్వ మందులు ముళ్ల పొదల్లో' కథనాలు వెలువడడంతో వైద్యాధికారులు స్పందించి మందులను తీసివేయాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు ముళ్ల పొదల్లో పడేసిన మందులను తీసివేశారు. తరువాత జిల్లా వైద్యాధికారి హర్షవర్దన్ రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లి డాక్టర్లను, సిబ్బందిని విచారించారు. చిన్నారిదొడ్డి సచివాలయానికి సంబంధించిన మందులని తెలుసుకొని రాళ్ళబూదుగూరు వైద్యులు శివకుమారి, ఉషారాణితో కలిసి సచివాలయం వెళ్లి ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, ఏఎన్‌ఎం అమరావతి, ఆశవర్కర్ అనుసూయమ్మలను విచారించారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలోని వేస్ట్ మెటీరియల్ తీసేసి శుభ్రపరచాలని పంచాయతీ కార్మికులకు సూచించారు. వారు చెత్తాచెదారం తీసివేస్తుండగా, గడువు ముగిసిన మందులను కూడా తీసివేయాలని ఆరోగ్య సిబ్బంది కారికులకు తెలిపారు. వారికి ఏ మందులు తీయాలో తెలియక వినియోగం తేది ఉన్న మందు లను కూడా తీసి పడేశారని విచారణ అధికారులకు తెలిపారు. అదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి విచారణ అధికారులకు రాత పూర్వకంగా రాసి ఇచ్చారు. నివదికను జిల్లా ఉన్నత అధికారులకు పంపుతామని డీపీఎంవో డాక్టర్ హర్షవర్దన్ తెలిపారు.

వరసిద్ధుడి అన్నదానానికి కూరగాయల వితరణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 26: కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి పలమనేరు వడ్డేపల్లె మార్కెట్ కమిటీకి చెందిన సత్యన్న గురువారం రెండు టన్నుల (12 రకాల) కూరగాయలను వితరణ చేసినట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. దాతకు స్వామి దర్శన ఏర్పాట్లను ఆలయాధికారులు చేశారు.

నేడు బోయకొండలో శాంతి హోమం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ..దేవదాయ కమిషనర్ ఆదేశాలతో వేదపండితుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు శాంతి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


చలపతి(ఫైల్)

పలమనేరు/బైరెడ్డిపల్లె: బైరెడ్డి పల్లి పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న చలపతి(57) గురువారం గుండె పోటుతో మృతిచెందారు. ఆయన పలమనేరు-పుంగనూరు రహదారి పక్కన గంగవరం సమీపంలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఆయన భౌతిక కాయాన్ని ఆయన స్వగ్రామం ఏ.కొత్తకోటలో దహనక్రియలు నిర్వహిస్తారని స్నేహితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

వి.కోట, సెప్టెంబరు 26: వి.కోట - పేర్నాంబట్ ప్రధాన రహదారి బంగ్లాఊరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదకుంటకు చెందిన మహాదేవన్ (68) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం సాయంత్రం గ్రామం నుంచి బంగాఊరుకు వచ్చిన మహాదేవన్ రోడ్డు పక్కన నడచి వెళుతుండగా అటుగా వచ్చిన ఎక్స్‌కవేటర్ అతడిని ఢీకొంది. గ్రామస్థులు అతడిని వి.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకర మలుపుల్లో కాషాయ హనుమ జెండాలు



పలమనేరు : మొగిలి ఘాట్ రోడ్డు లోని మలుపులు నిత్య ప్రమాదాలకు నిలయం కావడంతో ఇక్కడి గోవిందదామం, విశ్వ హిందూ పరిషత్ నాయకులు కాషాయ హనుమ చిత్రం ముద్రించిన జెండాలను కట్టారు. హనుమంతుల వారే ఇక వాహనదారులను ప్రమాదాలనుంచి రక్షిస్తారనే నమ్మకంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆకట్టుకున్న రాజసూయ యాగం

సోమల : సోమల మండలం కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా గురువారం రాజసూయయాగం ఘట్టాన్ని భాగవతారణి గీతాశ్రీ వివరించారు. ఉభయదారులైన మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ కన్వీనర్ శంకర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహారంతో రక్త హీనతకు చెక్

రొంపిచెర్ల : గర్భిణులు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం వలన రక్తహీనత, రోగాలనుంచి రక్షించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శిరీషా అన్నారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గురువారం చెంచెమరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వంటకాలు, కూరగాయలు, పండ్లు ప్రదర్శనగా ఉంచి వాటి వలన చేకూరే ప్రయోజనాలను విశదీకరించారు.

ప్రతి ఇంటికీ ప్రగతి కరపత్రాలు

సోమల, సెప్టెంబరు 26: వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పేర్కొన్నారు. గురువారం మిట్టపల్లె, కందూరులో ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసులు, సత్య, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రఘురామను పదవి నుంచి తొలగించాలి

పలమనేరు : డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజును వెంటనే పదవి నుంచి తొలగించాలని మానవహక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు మునిరత్నం, పార్థసారధి, దేవరాజు డిమాండు చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రఘురామ వంటి కుల ఉన్మాదులు పదవిలో ఉండేందుకు అనర్హులన్నారు. కాకినాడలో వైద్యుడు ఉమామహేశ్వర రావుపై ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేసిన ఘటనను కూడా వారు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మణి, గుర్రం సుబ్రమణ్యం, శివన్న, ఆనంద్, వినోద్‌కుమార్, బాబు, సాంశివ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పాడి పరిశ్రమ బలోపేతానికి 503 గోకులం షెడ్ల నిర్మాణం

● కలెక్టర్ సుమిత్ కుమార్


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం, సెప్టెంబరు 26: జిల్లాలో పాడి పరిశ్రమను విస్తరించి, రైతులకు లాభదాయకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఇందులో భాగంగానే గోకులం షెడ్లను మంజూరు చేసిందని, వాటి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కుప్పం మండల సచివాలయంలో గురువారం కుప్పం నియోజకవర్గంలో గోకులం షెడ్ల నిర్మాణంపై కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోకవర్గంలో అధికశాతం రైతాంగం పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇందువల్ల పాడిని అభివృద్ధి చేయడంకోసం నియోజకవర్గ పరిధిలో మొత్తం 503 గోకులం షెడ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేయాలని, మొత్తం ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. పశు సంవర్థక శాఖ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేసిన ప్రతిపాదనలపైన, బిల్లు అప్లోడింగ్‌పైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. గోకులం షెడ్ల నిర్మాణానికి సంబంధించి జియో ట్యాగింగ్ ద్వారా ఐడీ క్రియేట్ ఏయాలన్నారు. 90 శాతం సబ్సిడీతో చేపట్టే గోకులం షెడ్ల నిర్మాణాన్ని రైతులు త్వరితగతిన పూర్తి చేసేలా వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, పశుసంవర్థక శాఖ, డ్వామా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అర్హత ఉన్న ప్రతి రైతుకూ బిందు, తుంపర్ల సేద్య పరికరాలు

కుప్పం నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అందించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్థానిక మండల సచివాలయంలో ఆయన గురువారం దీనిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 3600 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్య పరికరాలను అందిం చేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకులు రైతులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి, వందశాతం బిందు, తుంపర్ల సేద్య పరికకరాలు రైతులకు అందజేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, ఏపీఎంఐపీ పీడీ బాల సుబ్రమణ్యం, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఏడీలు కోటేశ్వరరావు, అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన టపాకాయల సీజ్


టపాకాయలను సీజ్ చేసిన సీఐ, ఎస్ఐ - సోమలలో స్వాధీనం చేసుకున్న టపాసులు

కల్లూరు, సెప్టెంబర్ 26: కల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి రసీదులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన రూ.2.50 లక్షల విలువైన టపాకాయలను సీజ్ చేసినట్లు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ, ఎస్ఐ విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్రమంగా టపాకాయలు నిల్వచేసిన ఇళ్లపై దాడులు నిర్వహించామన్నారు. పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లిలో అక్రమంగా నిల్వచేసిన రూ.2లక్షలు విలువైన టపాకాయలు, కల్లూరులో అక్రమంగా నిల్వచేసిన రూ.50వేలు విలువైన టపాకాయలను గుర్తించి సీజ్ చేశామన్నారు. టపాకాయలు ముగ్గురు వ్యక్తులకు చెందినవిగా గుర్తించామని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చౌడేపల్లె : అక్రమంగా నిల్వ చేసిన టపాకాయలు సీజ్ చేసినట్లు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..స్థానిక బజారు వీధిలో టపాకాయల సీజనల్ వ్యాపారి శబరి వద్ద అక్రమంగా ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన టపాకాయలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏఎస్ఐ వాసు, కానిస్టేబుల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమల : మండలంలోని కందూరు, కోటగుండ్లపల్లెలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచిన గోదాములను తనిఖీ చేసి రూ. రెండు లక్షల విలువైన బాణ సంచాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మండలంలో ఎక్కడ గానీ టపాసులు అనుమతులు లేకుండా నిల్వ చేయరాదని, సమాచారం ఇస్తే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ నగేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా సంక్షేమం..సమాంతరంగా అభివృద్ధి

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు


సదుం సమావేశంలో మాట్లాడుతున్న చల్లా బాబు

సదుం, సెప్టెంబరు 26: తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు కారణంగా రాష్ట్రంలో సజావుగా సంక్షేమ పథకాల అమలు, సమాంతరంగా అభివృద్ధి పనులు సాగుతున్నట్లు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం-ప్రజావేదిక' కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన ప్రతి హామీని తూచ తప్పకుండా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ రెడ్డిప్రసాద్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మహేశ్వర రెడ్డి, జోగా రామకృష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మునిరెడ్డి, నారాయణ గౌడ్, అమరనాథ్ గౌడ్, సునీల్ కుమార్ రెడ్డి, మునిరాజన్న, సీరన్నగారి పవన్ కుమార్, మౌలా, ట్రక్కు. బాబు, వై.వెంకటరమణారెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ నారాయణ, సహదేవ, గిరీష్, ప్రకాశ్ రాయల్, మిమిక్రీ కిరణ్, ప్రతాప్, మురళీ, ఉమాపతి, పవన్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, జ్యోతిరెడ్డి, అన్ని శాఖల మండల అధికారులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలకు ప్రతిరూపం చంద్రబాబు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, సెప్టెంబర్26: అభివృద్ధి, సంక్షేమాలకు ప్రతిరూపం ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిధిలోని అబకలదొడ్డి, గుంజార్లపల్లె, చెంగుబల్లచ రాళ్ళబూదుగూరు, కెనమాకులపల్లె పంచాయతీలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉద్యోగస్తులకు ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు వేయడం వంటి ఎన్నో సంక్షేమ పథకాల నిర్ణయాలు ఈ వంద రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేశారన్నారు. అనంతరం టీడీపీ వందరోజుల పరిపాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు పివి నాగరాజు, చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, జయారెడ్డి, గోపాల్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం వీర్నమల, పెద్దతాండా, గుట్టూరుతండా గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం సభలు జరిగాయి. టీడీపీ నేతలు మునస్వామి, చలపతి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే పరమావధిగా కృషి చేస్తోందన్నారు. ఆయా సభల్లో మాజీ జడ్పీటీసీ బాలాజీనాయక్, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు రామ్మూర్తి, కామరాజనాయక్, జేయి, పాండియన్, భూపతి, రాజారాం, చంద్రశేఖరరెడ్డి, టీవీ రవి తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె : గుడుపల్లె మండలం ఓఎన్‌కొత్తూరులో గురువారం ఇది మంచి ప్రభుత్వం సభ నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బెటప్పనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్ర, నేతలు హేమాంబరగౌడు, సుబ్రహ్మణ్యం, అశోక్, గోపాల్, భానుమూర్తి తదితర నేతలు పాల్గొన్నారు.

565 మందికి కంటి అద్దాల పంపిణీ

కుప్పం, సెప్టెంబరు 26: కుప్పం నియోజకవర్గంలో కంటి సమస్యలున్న 565 మందికి కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు గురువారం ప్రభుత్వం తరఫున ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆగస్టు 24 నుంచి ఈనెల 3వ తేదీ వరకు కంటి పరీక్ష శిబిరం నిర్వహించి, కంటి సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వారికి ఇప్పుడు కంటి అద్దాలు పంపిణీ జరిగింది. కడా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనవాసరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామకుప్పం మండలం వీర్నమలలో కంటి రోగులకు ఉచిత కళ్ళజోళ్ళను టీడీపీ నేతలు పంపిణీ చేశారు.

సరైన సస్యరక్షణతోనే బంగాళదుంపలో అధిక దిగుబడులు


బంగాళదుంప సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

వి.కోట, సెప్టెంబరు 26: రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా బంగాళదుంపలో అధిక దిగుబడులు సాధ్యమని ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం వి.కోటలో బంగాళదుంప రైతులకు కోలారులోని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బంగాళదుం రకాలు, వాటి సాగు విధానం, పంటలను ఆశించే తెగుళ్ళు, వాటి నివారణ అంశాలపై శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. దీనితో పాటు ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగం, బిందు, తుంపర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. విత్తన దుంపలు నాటే ముందు రెడోమిల్ గోల్డ్, లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందు ద్రావణంతో విత్తన వృద్ధి చేయాలని సూచించారు. బ్యాక్టీరియల్ విల్ట్ ఉన్న పొలంలో టమోటా, వంగ, మిరపలాంటి పంటలతో కాకుండా పంటల మార్పిడితో క్యాబేజి, బీన్స్‌లాంటి ఆఇతర పంటలు మార్చాలన్నారు. బంగాళదుంపకు ఎక్కువగా వచ్చే ఆకుమాడు తెగుళ్ళ నివారణకు మెటలాక్సిల్‌తో పాటు, మాంకోజెబ్ లేదా సైమాక్సినిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆపై అనంతపురం గ్రామం వద్ద బంగాళదుంప సాగు చేస్తున్న తోటకు వెళ్ళి పంటలో తెగుళ్లను పరిశీలించారు. ఉద్యానశాఖ ముద్రించిన బంగాళదుంప సాగు ఆధునిక విధానాలపై ముద్రించిన పుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు వారి సందేహాలను సదస్సులో అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ శాస్త్రవేత్తలు డా.మంజునాథ రెడ్డి, డా. ఆషా, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం, ఉద్యానశాఖాధికారి లక్ష్మీప్రసూన, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శాంతిపురం : ఉద్యాన పంటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో జిల్లా ఉద్యానశాఖ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. తరువాత కోలారుకు చెందిన ఉద్యాన పంటల శాస్త్ర వేత్తలు మంజునాథరెడ్డి, అషాలు ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న బంగాళాదుంప పంటల సాగుపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందించే ప్రయోజనాల, సబ్సిడీ వివరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాంతిపురం, కుప్పం మండలాల ఉద్యాన శాఖ అధికారులు వింధ్య, డింపుప్రియ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మండల మహిళ అధ్యక్షురాలు శ్యామల, ఎఫ్ఈఓ అధ్యక్షుడు చలపతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రపంచంతో పోటీ పడదాం

చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యేలు



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 26: పరిశుభ్రతలో ప్రపంచంతో పోటీ పడదామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం గిరింపేటలోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ జిల్లా నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, బీజేపీ నేత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తా

ఇకపై నెలలో ఓ రోజు 'డయల్ యువర్ ఎమ్మెల్యే': గురజాల

చిత్తూరు, సెప్టెంబరు 26: ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం నగరపాలక కార్యాలయంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలను తెలిపారు. మొత్తం 42 మంది తమ సమస్యలను తెలియజేశారు. వీటిల్లో నగరంలో నీటి, డ్రైనేజీ సమస్యలు, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల పరిధిలోని రోడ్లు, రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌కో శాఖలకు సంబంధించినవి ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సమస్యలను దశలవారీగా, ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఇకపై నెలలో ఒక రోజు డయల్ యువర్ ఎమ్మెల్యేని మూడు గంటలపాటు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ కళావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సన్మానం


తిరుమలరాజుకు స్వీటు తినిపిస్తున్న హెచ్‌ఎం కేశవులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 26: కార్వేటినగరం మండలం డీఎంపురంలో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్(పీడీ) తిరుమలరాజును గురువారం పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈయన ఎనిమిదేళ్లుగా ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది, పాఠశాల ఉన్నతికి శ్రమించారని కొనియాడారు. హెచ్‌ఎం కేశవులు, త్యాగరాజు, చిరంజీవి, ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, డీఎంపురం పాఠశాల విద్యార్థులకు గురువారం శుభ్ దిన్ భోజనాన్ని తిరుమలరాజు వితరణ చేశారు. దీంతో విద్యార్థులకు వడ, పాయసంతో భోజనం వడ్డించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

గుడిపాల, సెప్టెంబరు 26: సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు అన్నారు. గురువారం గుడిపాల గ్రామ పంచాయతీలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి మాధవి, ఏపీఎం సుధారాణి, టీడీపీ నాయకులు తుమ్మల సాంబశివ నాయుడు, గోపి, రవి రెడ్డి, పళని, మురళీనాయుడు, జయచంద్ర గౌడ్, యోగానందం, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్ చౌదరి, శేఖర్, రాజ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో వైశాలి ప్రతిభ



యాదమరి, సెప్టెంబరు 26: కె.గొల్లపల్లె పాఠశాల విద్యార్థిని వైశాలి జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు గిరిరాజ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పీసీఆర్ ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో రూ.5000 బహుమతిని పొందింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి, టీచర్లు అభినందించారు.

పాలసముద్రం నూతన డీటీగా నాగరాజు

పాలసముద్రం, సెప్టెంబరు 26: పాలసముద్రం నూతన డిప్యూటీ తహసీల్దారు(డీటీ)గా కె.నాగరాజు నియమితులయ్యారు. ఈయన విజయపురం డీటీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన మధుబాబు.. చిత్తూరు ఆర్డీవో ఆఫీసుకు బదిలీ అయ్యారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన నాగరాజును తహసీల్దార్ వరలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

గుడిపాలకు స్వరూపరాణి

గుడిపాల: గుడిపాల డిప్యూటీ తహసీల్దార్‌గా స్వరూపారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ కళ్యాణి పదోన్నతిపై బదిలీ కావడంతో ఆమె స్థానంలో స్వరూపరాణి వచ్చారు.

ఏఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం, సెప్టెంబరు 26: పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో గురువారం రవి, లక్ష్మిలు ఏఎస్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరూ నగరి, ఐరాలలో పనిచేస్తుండగా, బదిలీపై వచ్చారు. వీరిని ఎస్‌ఐ భారతి, సిబ్బంది అభినందించారు.

చెకుముకి మండలస్థాయి పోటీలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 26: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి చెకుముకి పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ మేరకు ఎంఈవో దామోదరం తెలిపారు.

విషపు మొక్క ఆకు తిన్న వివాహిత మృతి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 26: జీవితంపై విరక్తి చెంది విషపు మొక్క ఆకు తిన్న వివాహిత మృతి చెందింది. చంద్రశేఖర్‌పురం గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ భార్య సరిత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన విషపు మొక్క ఆకు తినేశారు. గమనించిన కుటుంబీకులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం పోలీసులు తెలిపారు.

ఇద్దరు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

యాదమరి, సెప్టెంబరు 26: వేణుగోపాలపురం అటవీ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, నాలుగు కోడికత్తులు, రూ.1100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. పట్టుబడిన వారిలో ఇరువారం గ్రామానికి చెందిన ఆడమ్, చిత్తూరు టౌన్‌కు చెందిన కె.షంషీర్ ఉండగా, వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో 3నుంచి దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 26: తేనెబండలోని ముత్యాలమ్మ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. 3న మహాలక్ష్మి, 4న చాముండేశ్వరి, 5న అన్నపూర్ణ, 6న లలితా, 7న పార్వతి, 8న సరస్వతి, 9న సంతానలక్ష్మి, 10న మహిషాసుర, 11న రాజరాజేశ్వరి, 12న అమ్మవారి పవలింపు సేవలు నిర్వహించనున్నట్లు ఈవో గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గిరింపేట చిదంబరేశ్వరాలయంలోనూ..

గిరింపేట శివగామి సుందరి చిదంబరేశ్వరాలయంలోనూ ఉత్సవాలు జరగనున్నాయి. 3న మహాలక్ష్మి, 4న పసుపు, 5న కుంకుమ, 6న అన్నపూర్ణ, 7న చందన, 8న శాకాంబరి, 9న గాజులు, 10న పసుపు కుంకుమ, 11న బియ్యపుపిండి, 12న విజయలక్ష్మి అలంకరణలతో శివగామి సుందరి దేవి దర్శనమివ్వనుందని ఆలయ అర్చకుడు మహేష్ తెలిపారు.




కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా వరసిద్ధుడికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న విజయవాడ దుర్గామల్లేశ్వరం ఆలయ ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్‌తో ఈవో గురుప్రసాద్ - ఆస్థాన మండపంలో కళాకారిణి నృత్యం - ప్రాకారోత్సవానికి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఈవో, ఉభయదారులు

నేడు వరసిద్ధుడి బ్రహ్మోత్సవ లడ్డూ వేలం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 26: కాణిపాక క్షేత్రంలో 21 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల గుర్తుగా తయారు చేసిన 21 కిలోల మహా లడ్డూను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో గురుప్రసాద్ గురువారం తెలిపారు. స్వామి తెప్పపై మహాలడ్డూను ఉంచి పుష్కరిణిలో తిప్పనున్నట్లు పేర్కొన్నారు. తెప్పోత్సవం ముగిశాక వేలం ఉంటుందన్నారు.

అన్నదానానికి కూరగాయల వితరణ

అన్నదాన కార్యక్రమానికి పలమనేరు వడ్డేపల్లె మార్కెట్ కమిటీకి చెందిన సత్యన్న గురువారం రెండు టన్నుల (12 రకాల) కూరగాయలను వితరణ చేసినట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి పాల్గొన్నారు.


ఈవోకు కూరగాయలు అందజేస్తున్న సత్యన్న

పంచాయతీ'బడి'

- ఐదు తరగతులకు ఒకే గది
- ఏకోపాధ్యాయురాలితో బోధన


బడి నిర్వహిస్తున్న పంచాయతీ భవనం


ఓ గదిలో తరగతిని నిర్వహిస్తున్న ఏకోపాధ్యాయురాలు కవిత

వెదురుకుప్పం, సెప్టెంబరు 26: పంచాయతీ 'బడి' చూడాలంటే వెదురుకుప్పం మండలం గొడుగు చింతకు వెళ్లాల్సిందే. ఇక్కడి పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో గత విద్యా సంవత్సరం నుంచి గొడుగుచింత పంచాయతీ భవనంలోని ఓ గదిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జరుగుతోంది. ఈ పాఠశాలలో ఐదు తరగతులు ఉన్నాయి. ఒకే గది ఉండటంతో ఈ ఐదు తరగతులను అందులోనే నిర్వహిస్తున్నారు. పైగా ఏకోపాధ్యాయురాలిగా కవిత పనిచేస్తున్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్డి వంటి మౌలిక సదుపాయాలూ లేవు. ఇదిలా ఉంటే.. మల, మూత్ర విసర్జనకు పిల్లలు ఆరుబయటకు వెళుతున్నారు. ఆ పరిసరాలన్నీ ముళ్ల పొదలమయం కావడంతో విషపురుగుల బెడద ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని కూడా నిర్వాహకులు ఇంటి నుంచే తయారు చేసి, తెస్తున్నారు. వంట గది లేకపోవడమే దీనికి కారణం. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమే.

యువకుల శ్రమదానం


రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న యువత

నింద్ర, సెప్టెంబరు 26: కొప్పేడు పంచాయతీ వేదాంతపురం వద్ద తిరుపతి - చెన్నై జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రామానికి చెందిన యువకులు గురువారం శ్రమదానంతో పూడ్చారు. ఈ రహదారిపై వేదాంతపురం వద్ద గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో యువత రామప్రసాద్‌రెడ్డి, జయప్రకాష్ తదితరులు నడుం బిగించి, అందరితో శెభాష్ అనిపించుకున్నారు.

సాంస్కృతిక పోటీల్లో నగరి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నగరి సెప్టెంబరు 26: జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో నగరి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపదం గ్రూప్ డ్యాన్స్‌లో మేఘన, విజయలక్ష్మి, విశాలాక్షి, గాయత్రి, లోకేశ్వరి, పద్మ, కలైరోజా ప్రథమ బహుమతి సాధించారన్నారు. సోలో డ్యాన్స్‌లో గాయత్రి, పెయింటింగ్‌లో హేమావతి ద్వితీయ బహుమతులను, ఉపన్యాసంలో హేమావతి, అముద, సైఫ్ ఆలీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని వివరించారు. వీరికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన అరుణ కుమారిని కూడా ఈ సందర్భంగా సన్మానించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

'కూటమి' పాలనపై ప్రజల హర్షం


చెన్నసముద్రంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం చిత్తూరు రూరల్ మండలంలోని చెన్నసముద్రం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని చెప్పారు. అనంతరం 2047 స్వర్ణాంధ్ర వాల్‌పోస్టర్లను టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే పాలూరు, చెర్లోపల్లె గ్రామ పంచాయతీల్లో కూడా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా నేతలు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, మోహన్ రాజ్, చిత్తూరు తహసీల్దార్ కళావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం



నగరి: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా తెలిపారు. నగరి మండల పరిధిలోని గుండ్రాజుకుప్పం పంచాయతీలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి, ఎంఈవో శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, ధనంజయ రాజు, ఉమాపతిరాజు, చిన్నబ్బరాజు, రవిరాజు, జనసేన ఉపాధ్యక్షుడు నవీన్, చంద్రశేఖర్, ధన, నారాయణస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: కూటమి ప్రభుత్వం ఆదర్శంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు అన్నారు. గురువారం పన్నూరు దళితవాడ, ఆదిఆంధ్రవాడ, జగన్నాథపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు కపిల్, శామువేలు, చిన్నబ్బరాజు, శివలింగం, బాబు, శరత్, బెంజిమన్, పెరుమాళ్, దొరైరాజ్, లక్ష్మయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: శ్రీరామపురం, ఓరూరు పేట, ఇరుగువాయి, పాదిరి పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరావు, నాయకులు మనోహర్ నాయుడు, మనోజ్ యాదవ్, కాటయ్య, డిల్లీనాయుడు, అప్పారావు, అభిషేక్, గజేంద్రనాయుడు, బుజ్జి, స్వయిరాజ్, ఇళయరాజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని పులికల్లులో జరిగిన కార్యక్రమంలో మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కును జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అందజేశారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, హరిబాబునాయుడు, తలారిరెడ్డెప్ప, మనోహర్‌రెడ్డి, నరేంద్ర, భాస్కర్, యువరాజులునాయుడు, ఏకాంబరం, సురేష్‌చౌదరి, అశోక్, జనసేన మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాగరాజు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ సీజ్



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 26: గ్రానైట్ దిమ్మెను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని సీజ్ చేశారు. పిల్లిగుండ్లపల్లె క్వారీ నుంచి గ్రానైట్ దిమ్మెను తరలిస్తుండగా తిరుపతి రోడ్డు సమీపంలో 49.కొత్తపల్లెమిట్ట వద్ద ఎస్‌ఐ సుమన్ తన సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో లారీని సీజ్ చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు.

13 మంది జూదరుల అరెస్టు

చిత్తూరు, సెప్టెంబరు 26: గంగాసాగరం సమీపంలో కొందరు జూదమాడుతున్నట్లు స్పెషల్ పార్టీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో తాలూకా పోలీసులతోకలిసి జూదరస్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకుని, రూ.రెండు లక్షలను సీజ్ చేసినట్లు సమాచారం.

ఫొటోలు, వీడియోలు బయట పెడితే థాయ్‌లాండ్ బ్యాచ్ జైలుకే: ఎమ్మెల్యే థామస్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, సెప్టెంబరు 26: ఫొటోలు, వీడియోలు బయట పెడితే థాయ్‌లాండ్ బ్యాచ్ జైలుకే అంటూ గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ హెచ్చరించారు. గురువారం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రాజకీయ నాయకుడి వలె తన పాస్‌పోర్టుపై థాయ్‌లాండ్ సింబల్ ఉండదని చెప్పారు. థాయ్‌లాండ్ బ్యాచ్ నోరు అదుపులో పెట్టుకుని కలసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి యుగంధర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు రాజన్, కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు, టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మాదిరాజు జనార్ధన్‌రాజు, నాయకులు దాసరి గణేష్, చంద్రమౌళి, దాము, రవియాదవ్, బీగాల రమేష్‌రాయల్, తిరుమలనాథ్, చెంగల్రాయులు, హేమంత్‌రెడ్డి, ఢిల్లీకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు యామిని ఎంపిక



నింద్ర, సెప్టెంబరు 26: శ్రీకాకుళంలో అక్టోబరు 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీలకు అరూరు జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్ఞానకుమార్ తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన 200, 400 మీటర్ల పరుగు పందెంలో ఆమె ప్రతిభ చూపారన్నారు.

కులందేశ్వరస్వామి సేవలో సినీ నటి రాశి



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 26: కట్టమంచి కులందేశ్వరాలయంలో గురువారం సినీ నటి రాశితోపాటు తమిళచిత్ర నటీనటులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఓ తమిళ సినిమా నిశ్చితార్థం సన్నివేశాలను ఆలయంలో చిత్రీకరించారు. అందులో రాశి పాల్గొన్నారు. షూటింగ్ అయ్యాక ఆమె స్వామిని దర్శించుకున్నారు. షూటింగ్ చూడటానికి పరిసర ప్రాంతాల జనం తరలివచ్చారు.

అంగన్వాడీ భవనం లేక వరండాలో చిన్నారుల అవస్థ


పూర్తికాని అంగన్వాడీ భవనం (ఇన్‌సెట్లో) వరండాలో చిన్నారులు

నింద్ర, సెప్టెంబరు 26: అంగన్వాడీ భవనం లేక చిన్నారులు వరండాలో అవస్థ పడాల్సి వస్తోందని నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు. నింద్ర మండలం కచ్చరవేడు పంచాయతీలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి సొంత భవనాలు లేకపోవడంతో 2014-19 మధ్య కాలంలో ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనంలో కొనసాగేది. 2018లో అంగన్వాడీకి సొంత భవనం మంజూరు కావడం, నిర్మాణ పనులు చేపట్టగా, ఎన్నికలు జరగడం.. ప్రభుత్వం మారడంతో అంగన్వాడీ భవనం నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. తర్వాత ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలను ఖాళీ చేయించారు. గ్రామంలో ఓచోట మూడేళ్లు కొనసాగించారు. ఆ భవన యజమాని ఇల్లు నిర్మించాలని అక్కడ నుంచి ఖాళీ చేసి ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్నారు. ఇపుడు ప్రభుత్వం మారినా, స్థానిక ఎమ్మెల్యే చెప్పినా అటు విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులు చొరవ చూపకపోవడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఒక గదిని చిన్నారులకు కేటాయించాలని కోరుతున్నారు.

సింగిల్‌విండోను తనిఖీ చేసిన డీసీవో


సింగిల్‌విండోను తనిఖీ చేస్తున్న నాగవర్ధన

గుడిపాల, సెప్టెంబరు 26: గుడిపాల సింగిల్ విండో కార్యాలయాన్ని గురువారం డీసీవో నాగవర్ధన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం సింగిల్ విండో ఆవరణంలో మొక్కలు నాటారు. జిల్లాస్థాయి అధికారులు వనజ, బ్రహ్మానంద రెడ్డి, సూపరింటెండెంట్ బాలాజీ, సింగిల్‌విండో సీఈవో పట్టాభి, సెల్వం, జిత్తు పాల్గొన్నారు.

దినసరి మార్కెట్ సముదాయం పూర్తయ్యేదెప్పుడు?


ఎండలో ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులు (ఫైల్ ఫొటో)


పునాదులకే పరిమితమైవున్న దినసరి మార్కెట్ సముదాయం

నగరి, సెప్టెంబరు 26: నగరి సంత మైదానంలో గుడ్‌విల్ ప్రాతిపదికన ఏడాదిక్రితం జోరుగా ప్రారంభించిన దినసరి మార్కెట్ సముదాయం అర్ధంతరంగా ఆగిపోయింది. పట్టణ నడిబొడ్డున కోట్లరూపాయల విలువ చేసే సంత మైదానంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఈ మార్కెట్ నిర్మాణానికి టెండర్లు వేశారు. మొత్తం 31 గదులను రూ.2.36 కోట్లతో పనులు చేపట్టారు. ఇందుకుగాను గుడ్‌విల్ పద్ధతి కింద మొదటి విడత కాంట్రాక్టర్ల నుంచి రూ.2.36 కోట్లను వసూలు చేశారు. పనులకు అప్పటి మంత్రి రోజా చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. ఇక ఆగస్టు 31వ తేదీన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మార్కెటింగ్ సముదాయం పనులు ప్రారంభమవుతాయా లేదా అన్న అనుమానాన్ని కౌన్సిలర్లే వ్యక్తం చేయడం గమనార్హం. అయితే మొదటి విడత వసూలు చేసిన నగదుతో పునాదుల వరకు పనులు చేశామని.. రెండోవిడత వసూలు చేసి మోల్డింగ్ వరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

చిరువ్యాపారులకు ఇబ్బందులు

దినసరి మార్కెట్ సముదాయం కోసం సంత మైదానంలోనే గదుల నిర్మాణం చేపట్టడంతో వారపు సంత జరుపుకోవడానికి స్థలాభావం ఏర్పడటంతో చిరు వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శుక్రవారం నాడు రైతులు, వ్యాపారస్తులు రోడ్డుపైనే మార్కెట్ (కూరగాయలు అమ్ముకోవడం) నిర్వహిస్తున్నారు.

చినుకుపడితే చిత్తడే


బురదమయంగా మిట్టకండ్రిగ హరిజనవాడ రోడ్డు

నింద్ర, సెప్టెంబరు 26: మండలంలోని గ్రామీణ రోడ్లు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. మండలంలోని చవరంబాకం రోడ్డు, మిట్టకండ్రిగ, హరిజనవాడకు వెళ్లే రోడ్డు వర్షాలకు గుంతలతో నిండి.. బురదమయంగా ఉంది. ఈ రహదారిలో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పడప్పుడు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.